భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 32.0 - కనిష్ఠం : 25.0
తణుకు : 31.0 - 25.0

రేపు మంత్రి నారాయణ రాక

పాలకొల్లు, సెప్టెంబరు 27: రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఈనెల 29వ తేదీన పాలకొల్లులో పర్యటిస్తున్నట్టు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, నాయకులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10గంటలకు మున్సపల్ వాటర్ వర్క్స్ వద్దకు మంత్రి నారాయణ రానున్నారని, అక్కడి నుంచి హిందూ కైలాస వనం (శ్మశానం), డంపింగ్ యార్డు వద్దకు అనంతరం అబ్దుల్ కలాం పార్కు, రామగుండం ఉద్యాన వనం, ఎన్టీఆర్ కళాక్షేత్రాం పరిశీలించిన అనంతరం అన్న క్యాంటిన్ సందర్శిస్తారని తెలిపారు. అనంతరం టిడ్కో గృహాల కాలనీ వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడటం, అసంపూర్తిగా ఉన్న గృహాలను పరిశీలించిన తరువాత విలేకర్లతో మాట్లాడతారని మంత్రి నిమ్మల తెలిపారు. అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో రివ్యూ సమావేశం తనతో కలిసి నిర్వహిస్తారని తెలిపారు.

సబ్ డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్

సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

భీమవరం క్రైం, సెప్టెంబరు 27 : భీమవరం సబ్ డివిజన్‌లో 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉందని భీమవరం డీఎస్పీ ఆర్‌జి జయసూర్య తెలిపారు. పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కాళ్ళ మండలం ఏలూరుపాడులో జరిగిన సంఘటనల దృష్ట్యా స్థానిక తహసీల్దార్ 144 సెక్షన్ విధించారని, అందువలన నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదన్నారు.

పెరిగిన గోదావరి

పోలవరం, సెప్టెంబరు 27 : అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో, ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం శుక్రవారం నాటికి స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 1,83,562 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.890 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.920 మీటర్లు నీటి మట్టం నమోదైనట్టు అధికారులు తెలిపారు. పోలవరం మండలం ఏజన్సీ ప్రాంతాల్లో రెండు రోజు లుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కొండవాగులు ఉధృతంగా ప్రవహించి జలాలు ఎల్‌ఎన్‌డీ పేట కొవ్వాడ రిజర్వాయర్‌లోకి చేరడంతో శుక్రవారం రిజర్వాయర్ నీటి మట్టం అనూహ్యంగా పెరిగింది. రిజర్వాయర్ నీటిమట్టం 90.15 మీటర్లు నమోదైంది.

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఎంపీ మహేశ్



ఏలూరు టూటౌన్, సెప్టెం బరు 27 : పెట్రోలియం, సహజ వాయువు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ నియమితులయ్యారు. తనను స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నియమించినందుకు ప్రధాన నరేంద్రమోదీ, స్పీకర్ ఓంబిర్లా, ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్టాండింగ్ కమిటీకి మెంబర్‌గా నియమితులవడం గౌరవంగా భావిస్తున్నానన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి కృషి

ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు


ఆకివీడులోని అయి-భీమవరం రోడ్‌లో రామరాజును గజమాలతో సత్కరిస్తున్న కూటమి అభిమానులు

కాళ్ళ/ఆకివీడు/ఆకివీడు రూరల్/పాలకోడేరు, సెప్టెంబరు 27 : రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. ఏపీఐఐసీ ఛైర్మన్ హోదాలో కాళ్ళ మండలానికి విచ్చేసిన రామరాజుకు కూటమి శ్రేణులు శుక్రవారం ఘనస్వాగతం పలికారు. ఏలూరుపాడు నుంచి ర్యాలీగా బయలుదేరి కాళ్ళకూరు వెంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అంతకు ముందు అయి-భీమవరం రోడ్‌లో కూటమి శ్రేణులు గజమాలతో ఘనంగా సత్కరించారు. దుంపగడపలోని ఉప్పుటేరు వద్ద కూడా ఘన స్వాగతం లభించింది. నాయకులు దుంపగడప, ఆకివీడు, అయిభీమవరం, చెరుకుమిల్లి గ్రామాలు మీదుగా ర్యాలీగా తరలి వెళ్ళారు. పాలకోడేరు మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. పాలకోడేరు మండలం నుంచి ర్యాలీగా బయల్దేరి ఆకివీడులోని ఉప్పుటేరు వద్ద మంతెన రామరాజుకు గజమాలలతో స్వాగతం పలికారు.

మహిళా సంఘాలపై ఆర్పీల పెత్తనం



- వివాదాస్పదమవుతున్న ఆర్‌పీల వైఖరి
- గడువుకు ముందే రుణాలు చెల్లించాలంటూ ఒత్తిడి
- అధిక మొత్తంలో రుణాలు తీసుకోవాలంటూ దిశానిర్దేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరం రూరల్ మండలం చిన అమిరంలో మహిళా సంఘాలకు సేవలు అందించే రిసోర్స్ పర్సన్(ఆర్‌పీ)లపై ఆరోపణలు వెల్లువెత్తాయి. సర్వసభ్య సమావేశంలో మహిళలు ఆర్‌పీల పనితీరును తప్పుపట్టారు. అవినీతి విమర్శలు చేశారు. అదే సమావేశంలో మహిళా సంఘాల సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారితోపాటు ఐదుగురు కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకొన్నారు. అంత వరకు ఆర్‌పీల వద్ద ఉన్న రికార్డులు, చెక్ బుక్‌లను కార్యానిర్వాహక(ఓబి) ప్రతినిధులకు అప్పగించారు. చిన అమిరం గ్రామంలో దాదాపు 40 మహిళా సంఘాలున్నాయి. వాటితో నాలుగు సమాఖ్యలను ఏర్పాటు చేశారు. సర్వసభ్య సమావేశాలను ఏర్పాటుచేసి కొత్త కార్యవర్గాలను ఎన్నుకున్నారు. అనంతరం మూడు సమాఖ్యలకు ఆర్‌పీలను నియమించారు. అయితే తమను అన్యాయంగా తొలగించేందుకు పూనుకున్నారంటూ మెప్మా అధికారులకు ఫిర్యాదు చేశారు. మెప్మా అధికారులు విచారణ చేపట్టారు. కొత్త ఆర్‌పీలకు పిలుపులేదు. మహిళా సంఘాలు తీర్మానాలతో ఏర్పాటు చేసుకున్న కార్యవర్గ ప్రతినిధుల వద్ద ఉన్న రికార్డులను, చెక్‌బుక్‌లను పాత ఆర్‌పీలకు ఇచ్చేయాలంటూ అధికారులు ఆదేశించారు. అయితే స్థానిక కూటమి నేతలు ఆ ప్రతిపాదనను అంగీకరించలేదు. నాలుగు సమాఖ్యల(ఎస్ఎల్ఎఫ్)కు ప్రాతినిధ్యం వహించిన మహిళా ప్రతినిధులు రికార్డులు పాత ఆర్‌పీలకు ఇవ్వలేదు. ఈ క్రమంలోనే ఓ పాత ఆర్‌పీ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. సదరు సమాఖ్యలో కొత్త ఆర్‌పీ నియామకం వాయిదా పడింది. మిగిలిన మూడు సమాఖ్యల్లో నూతనంగా నియమితులైన ఆర్‌పీలు భీమవరంలో మెప్మా విభాగానికి వెళుతున్నారు. మహిళా సంఘాలు తీర్మానంతో ఎన్నుకున్న వారిని కాదంటూ ఆదేశాలిచ్చిన అధికారులు అభాసుపాలయ్యారు. భీమవరంలో వైసీపీ నేతకు అనుకూలంగా ఇప్పటికీ మెప్మా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ కూటమి నేతలు మండిపడుతున్నారు. అందువల్లే మహిళా సంఘాల తీర్మానాన్ని పక్కన పెట్టి, నిబంధనలు తుంగలో తొక్కి ఆదేశాలిస్తున్నారని విమర్శిస్తున్నారు. కొత్త వారే ఇప్పుడు అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే అధికారుల వైఖరివల్ల మహిళా సంఘాలకు స్వేచ్ఛలేకుండా పోతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భీమవరంలోనూ వివాదాలు

ఇటీవల భీమవరం పట్టణంలోనూ సమావేశాలు ఏర్పాటు చేస్తే మహిళా సభ్యులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. మహిళా సంఘాలపై కొందరి ఆర్‌పీల పెత్తనం అధికం అవుతోందంటూ గళమెత్తారు. అయితే అధికారులు అండదండలు ఆర్‌పీలకు ఉండడంతో ఏమీ చేయలేకపోయారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి సమస్యలు అధికంగా ఉంటున్నాయి. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకుంటున్నారు. అయినా కమీషన్ రూపంలో మళ్లీ మహిళా సంఘాల వద్ద కొందరు ఆర్‌పీలు అధికమొత్తంలో కమీషన్‌లు తీసుకుంటున్నారు. దీనిపైనే ఇప్పుడు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ హయాంలో తమకు అనుకూలంగా లేరంటూ ఎంతోమంది ఆర్‌పీలను తొలగించారు. కొత్తవారిని వేసుకున్నారు. అదేపని ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మహిళా సభ్యులు తీర్మానాలతో మార్పులు చేస్తుంటే అధికారులనుంచి సహాయ నిరాకరణ ఉంటుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గడువుకు ముందే రుణాలు

మహిళా సంఘాలకు బ్యాంకులు ఇచ్చే రుణాలు వాయిదా పద్ధతిలో రెండున్నరేళ్ల వరకు చెల్లించే అవకాశం ఉంటుంది. ప్రతినెలా పొదుపు కూడా చేస్తుంటారు. సంఘానికి రూ. 100లు చెల్లిస్తారు. ఇలా ప్రతినెలా రూ. 500 పొదుపు అవుతుంది. అలాగే ఒక సమాఖ్య ఏర్పాటు చేస్తారు. అంటే ఒక్కో సమాఖ్యకు ప్రతినెలా వేల రూపాయల పొదుపు వస్తుంది. సమాఖ్య కోసం ప్రతినెలా ఒక్కో సభ్యురాలు రూ. 50 పొదుపు చెల్లిస్తారు. అంటే రూ. 10వేల వరకు ప్రతి నెలా సమాఖ్యలో పొదుపు అవుతుంది. అందులో నుంచి మహిళలకు రుణాలు ఇస్తుంటారు. కార్యవర్గ ప్రతినిధులదే బాధ్యత. అయితే కొన్ని చోట్ల ఆర్‌పీల వద్ద రికార్డులు, చెక్కులు ఉంటున్నాయి. దీనిని ప్రశ్నించేవారు లేకుండా పోయారు. బ్యాంకులనుంచి రుణాలు ఇవ్వడంతో సహాయం చేయడంలో మాత్రమే ఆర్‌పీలు కీలకంగా ఉంటారు. అక్కడ కూడా రుణాన్ని బట్టి కొందరు ఆర్‌పీలు కమీషన్‌లు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి వేతనం రావడం లేదంటూ మహిళా సంఘాలనుంచి సొమ్ములు వసూలు చేస్తున్నారు. ఇలా పెద్దమొత్తంలో సంపాదించిన ఆర్‌పీలు కూడా ఉన్నారు. వాస్తవానికి రుణాన్ని బట్టి రెండున్నరేళ్ల వరకు ప్రతినెలా వాయిదా రూపంలో మహిళలు తిరిగి బ్యాంకులకు చెల్లిస్తుంటారు. అయితే గడువుకు ముందే రుణాలు చెల్లించాలంటూ ఆర్‌పీల నుంచి ఒత్తిడి ఎదురవుతోంది. తిరిగి రుణం మొత్తం చెల్లించాల్సి వస్తుంది. అదే సమయంలో రుణాన్ని పెంచుతున్నారు. తిరిగి వాయిదాలు చెల్లించలేమంటూ మహిళలు మొత్తుకుంటున్నా ఆర్‌పీలనుంచి చీవాట్లు ఎదురవుతున్నాయి. అధికమొత్తంలో రుణం తీసుకోకపోతే సంఘాలను రద్దు చేస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా కొందరి ఆర్‌పీల వ్యవహారం వివాదాలకు తావిస్తోంది.

విలీన గ్రామాల బాధ్యత మెప్మాదే

జిల్లాలో 399 సమాఖ్యలున్నాయి. మొత్తంపైన 9357 సంఘాలు క్రియాశీలకంగా ఉన్నాయి. అంటే ఒక్కో సమాఖ్యలో సగటున 23 సంఘాలు ఉన్నట్టు లెక్క. విలీన గ్రామాలతో సమాఖ్య సంఖ్య అధికమైంది. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు పట్టణాల్లో విలీన గ్రామాలున్నాయి. గతంలో అక్కడ మహిళా సంఘాలు డ్వాక్రా పరిధిలో ఉండేవి. డీఆర్‌డీఏ పర్యవేక్షణ చేసేది. ప్రభుత్వం విలీన ఉత్తర్వులు జారీచేసిన తర్వాత సంబంధిత గ్రామాల్లో మహిళా సంఘాలు, సమాఖ్యలను మెప్మాలో చేర్చారు. ఇలా 65 సమాఖ్యలు కొత్తగా మెప్మాలో చేరాయి. వాటితో కలిపి ఇప్పుడు 399 సమాఖ్యలు అయ్యాయి. ఇలా విలీన గ్రామాల్లో సంఘాల బాధ్యతను మెప్మా చూస్తోంది.

ప్రభుత్వ సర్క్యులర్ అమలు ఎక్కడ..

మహిళా సంఘాల నిర్వహణలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. ప్రతి రెండేళ్లకు సమాఖ్య కార్యవర్గాన్ని మార్చుకోవాలి. సమాఖ్యలో ఉన్న మహిళా సంఘాలు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి కొత్త కార్యవర్గాన్ని ఐదుగురు సభ్యులతో ఎన్నుకుంటారు. వారిని ఓబీలుగా పిలుస్తారు. అలాగే ప్రతిమూడేళ్లకు ఆర్‌పీలను మార్చుకోవాలి. ప్రతిఏటా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించుకోవాలి. అయితే ఆర్‌పీల విషయంలో అనాదిగా పాత వారే కొనసాగుతున్నారు. మహిళా సభ్యులంతా తమ చెప్పుచేతల్లో ఉన్నారంటూ కొందరు పెత్తనం చెలాయిస్తున్నారు. గడచిన ఎన్నికల్లో భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు వద్దకు కొందరు ఆర్‌పీలు వెళ్లారు. తమ చేతుల్లో మహిళలున్నారు. తమ సంగతేంటి అంటూ ప్రశ్నించారు. వైసీపీ వాళ్లు సొమ్ములు ఇచ్చారు. మీరేమి చేస్తారంటూ అడిగారు. ఇదే విషయాన్ని ఇటీవల ఓ సభలో ఎమ్మెల్యే అంజిబాబు ప్రస్తావించారు. అంటే కొందరు ఆర్‌పీలు ఎంతగా మహిళా సభ్యులపై పెత్తనం చెలాయిస్తున్నారో అర్థమవుతోంది.



అప్రోచ్ రోడ్లకు మోక్షమెప్పుడో..?

- వైసీపీ హయాంలో ఉత్తుత్తి నిధులు
- టెండర్లు పిలిచినా స్పందించని కాంట్రాక్టర్లు
- మళ్లీ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే పనులు
- కూటమి ప్రభుత్వంలో ప్రయత్నాలు

భీమవరం రూరల్, సెప్టెంబరు 27: భీమవరం నియోజకవర్గానికి వైసీపీ హయాంలో తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటికీ ఆ ప్రభావం కనిపిస్తోంది. అభివృద్ధి విషయంలో మళ్లీ కొత్తగా నిధులు వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం లభించడం లేదు. ముఖ్యంగా యనమదుర్రుపై వంతెనలకు అప్రోచ్ రహదారులను నిర్మించలేదు. ఎమ్మెల్యేగా అంజిబాబు ఉన్నప్పుడు 2012లో వంతెనలను పూర్తి చేశారు. అప్రోచ్ రహదారులు పెండింగ్‌లో ఉండిపోయాయి. గడచిన అసెంబ్లీ ఎన్నికల ముందు జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో భీమవరం వచ్చినప్పుడు అప్పటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అప్రోచ్ రహదారుల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని విన్నవించారు. దాంతో రూ. 36 కోట్లు మంజూరు చేస్తున్నట్టు జగన్‌మోహన్ రెడ్డి ప్రకటిం చారు. టెండర్‌లు పిలిచారు. అయినా కాంట్రాక్టర్‌లు స్పందించలేదు. ఒక్కరు కూడా టెండర్ వేయలేదు. ఏడాది ఎన్నికలు ఉన్నాయనగా నిధులు మంజూరయ్యాయి. మరికొద్ది నెలల్లో ఎన్నికలు ఉన్నాయన్న ఉద్దేశంతో ఒక్కరు కూడా టెండర్‌లు దాఖలు చేయలేదు. పైగా వైసీపీ హయాంలో బిల్లులు మంజూరు చేయడం లేదు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు ఇప్పుడు సొంత ఆస్తులు అమ్ముకుంటు న్నారు. తాడేపల్లిగూడెంలో రూ. 26 కోట్లతో రహదారి నిర్మించిన కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖలో ఎంతో మంది కాంట్రాక్టర్‌లకు బిల్లులు రాకపోవడంతో అప్పులు పాలయ్యారు. వైసీపీ ప్రభుత్వంపై విశ్వసనీయత కోల్పోవడంతో కొత్త పనులకు అప్పట్లో టెండర్‌లు దాఖలు చేయలేదు. యనమదుర్రు వంతెనలకు అదే పరిస్థితి ఎదురైంది. అప్రోచ్ రహదారులకు కాంట్రాక్టర్‌లకు స్పందించలేదు.

కొత్త బడ్జెట్‌లో కేటాయించాల్సిందే..

టెండర్‌లు వేయకపోవడంతో గతంలో మంజూరైన నిధులు మురిగిపోయాయి. కూటమి ప్రభుత్వం కొత్తగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.అప్పుడే అప్రోచ్ రహదారులకు అవకాశం ఉంటుంది. భీమవరం రూరల్ మండలంలో పది గ్రామాల ప్రజల రాకపోకలకు అప్రోచ్ వంతెనలు ఎంతగానో ఉపయోగపడ నున్నాయి. భీమవరం ప్రజలకు దశాబ్దాల కల నెరవేరనుంది. యనమదుర్రు ప్రవాహానికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలు భీమవరం వచ్చి వెళ్లాల్సి వస్తోంది. ఎదురుగా ఉన్న గ్రామమైనా సరే కిలోమీటర్లు దూరం ప్రయాణం చేయాలి. అప్రోచ్ రహదారుల నిర్మాణం పూర్తయితేనే ప్రజల చిరకాలవాంఛ నెరవేరుతుంది.

తిండికీ తిప్పలే..!

ఏడు నెలలుగా హాస్టల్స్‌కు బిల్లులు నిల్



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 27: హాస్టల్స్‌కు బిల్లులు సరిపడక సిబ్బంది, విద్యార్థులు అయిదేళ్లుగా ఆర్తనాదాలు చేస్తున్నారు. ఒక పక్క విద్యార్థికి సరిపడా నిధులు ఇవ్వకపోవడం, మరోవైపు బిల్లులు విడుదల కాక సిబ్బంది అప్పులు చేసి సర్దుకునే పరిస్థితి నెలకొన్నది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలల బిల్లులు వేసినా మరో 10 నెలల బిల్లుల చెల్లించాల్సి ఉంది. దీంతో ఇటు విద్యార్థులకు భోజనాలు వడ్డించలేక, బిల్లులు రాక హాస్టల్స్ సిబ్బంది నలిగిపోతున్నారు. ఫలితంగా విద్యార్థులకు భోజనాల అందించడంలో నాణ్యత లోపిస్తుందనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

మెనూలో రూ.600 లోటు..

ప్రభుత్వం నిర్దేశించిన మెను ప్రకారం ప్రతీ విద్యార్థికి నెలకు రూ.2200 అవుతుందని ధరల పట్టిక ప్రకారం ప్రతిపాదించారు. అయితే ప్రభుత్వం నెలకు రూ.1600 ఇస్తుంది. దీని ప్రకారం నెలకు ఒక్కొ విద్యార్థికి రూ.600 లోటు చూపి స్తున్నారు. అంటే ఒక్కో విదార్థికి కడుపునిండా భోజనం పెట్టాలంటే అయ్యే ఖర్చుకన్నా రూ.600లు తక్కువగా ప్రభుత్వం అందిస్తున్నదనేది హాస్టల్స్ నిర్వాహకుల ఆవేదన.

జిల్లాలో 109 హాస్టల్స్

జిల్లాలో సాంఘీక సంక్షేమ హాస్టల్స్ 35 ఉండగా, ఎస్సీ హాస్టల్స్ 35, బీసీ హాస్టల్స్ 39, ఎస్టీ హాస్టల్స్ 2 ఉండగా వాటిలో 7900 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. సకాలంలో నిదులు విడుదల చేయకపోవడంతో కొన్ని హాస్టల్స్‌లో భోజనాల్లో నాణ్యత లోపిస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది నెలలుగా బిల్లులు లేవు..

గత వైసీపి ప్రభుత్వంలో హాస్టల్స్‌కు బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడంతో జిల్లాలోని 35 సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్స్‌కు డిసెంబర్ నెల నుంచి బిల్లులు రాలేదు. వాటితోపాటు మిగతా హాస్టల్స్‌కు ఏడు నెలల బిల్లులు రావాల్సిఉండగా తాజాగా కూటమి ప్రభుత్వం 3 నెలల బిల్లులు చెల్లించారు.

అప్పుల్లో సిబ్బంది..

హాస్టల్స్‌లో బాధ్యులుగా ఉండే వార్డెన్‌లు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరికి కిరాణా దుకాణాల వాళ్ల అరువు ఇవ్వకపోవడంతో బయట అప్పులు తెచ్చి విద్యార్థుల కడుపునింపడం వారికి భారంగా మారింది.

విద్యుత్ సమస్యలకు ఉచిత పరిష్కారం

1912 నంబర్‌కు ఫిర్యాదు చేయండి

వేదిక చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ

తణుకు ఆసుపత్రిలో వైద్యాధికారుల తనిఖీ

7

ఎస్ఈ రఘునాథ్‌బాబు బాధ్యతల స్వీకరణ



భీమవరం టౌన్, సెప్టెంబరు 27 : ఏపీఈపీడీసీఎల్ భీమవరం సర్కిల్ ఎస్ఈగా రఘునాథ్‌బాబు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కొత్తసర్కిల్స్‌ను ఏర్పాటు చెయ్యటంతో ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా భీమవరం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావుతోపాటు ఏడీఈలు, ఏఈలు, కార్యాలయ సిబ్బంది. కాంట్రాక్టర్లు తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ సమస్యలకు ఉచిత పరిష్కారం



మాట్లాడుతున్న వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ సత్యనారాయణ

భీమవరం టౌన్, సెప్టెంబరు 27 : విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఉచితంగా పరిష్కరించుకోవాలని వేదిక చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ సూచించారు. శుక్రవారం విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరణకు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై 1912కు ఫిర్యాదు చెయ్యాలన్నారు. వినియోగదారుల వద్దకు తామే వచ్చి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 8,112 ఫిర్యాదులు రాగా వాటిలో 8,036 పరిష్కరించామని 76 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ ఏడాదికి సంబంధించి 350 ఫిర్యాదులు రాగా 76 కేసులు పరిష్కరించాల్సి ఉందన్నారు. స్వతంత్ర సభ్యుడు డాక్టర్ రాయసం సురేంద్ర కుమార్ , డీఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో భాను నాయక్

తణుకు ఆసుపత్రిలో వైద్యాధికారుల తనిఖీ

తణుకు, సెప్టెంబరు 27 : తణుకు పట్టణంలోని భాను ఆసుపత్రిలో జిల్లా వైద్యాధికారులు శుక్రవారం తనిఖీలు చేట్టారు. అత్తిలి గ్రామానికి 18 సంవత్సరాల యువకుడు డెంగీ వైద్యం కోసం భాను ఆసుపత్రిలో చేరి ఈనెల 9వ తేదీ వరకు వైద్యం పొందాడని సరైన వైద్యం అందించకపోవడంతో చనిపోయాడని జిల్లా కలెక్టరు, జిల్లా వైద్యాధికారికి బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అడిషినల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భాను నాయక్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో విచారణ చేపట్టారు. విచారణలో రోగులకు సంబంధించి ఎలాంటి పత్రాలు, ల్యాబ్‌కు సంబంధించి అనుమతులు లేవని తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు, డీఎంహెచ్‌వోకు అందిస్తామని చెప్పారు.



సర్టిఫికెట్లు, మెమొంటోలతో విద్యార్థులు, అధికారులు

పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రణాళికలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 27: జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని జడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు ఆదేశించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు శ్రీవారి కొండపై శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ఆలయ అధికారులు, సెట్‌వెల్ అధికారి ప్రభాకరరావులు యువతతో మానవహారాన్ని ఏర్పాటు చేసి స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. సెట్‌వెల్ అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలైన గుంటుపల్లి బౌద్ధారామాలు, కొల్లేరు, పోలవరం, పట్టిసీమ చాలా ప్రాముఖ్యత కల్గినవని ఈ ప్రాంతాలను ప్రతీ ఒక్కరూ సందర్శించాలని పిలుపునిచ్చారు. మండల ప్రత్యేక అధికారి నెహ్రూ మాట్లాడుతూ పురాణ ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమలలో ఈ కార్యక్రమాలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం పర్యాటకశాఖ కరపత్రాన్ని విడుదల చేసి కళాశాల విద్యార్థులకు సర్టిఫికేట్లు, బహుమతులను అందజేశారు.

ఎంబీబీఎస్ మొదటి కౌన్సెలింగ్ పూర్తి



కేరళ విద్యార్థిని హృదయ్‌కి అడ్మిషన్ పత్రం అందిస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిధర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 27 : ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్‌కు మొదటి కౌన్సెలింగ్ శుక్రవారంతో పూర్తి అయింది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలను 2023 ఏప్రిల్‌లో 26న ప్రభుత్వం అనుమతులు ఇచ్చి 150 ఎంబీ బీఎస్ సీట్లు మంజూరు చేసింది. దీంతో గత ఏడాది అన్ని సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది 23వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ కోర్సు తరగతులు ప్రారంభమయ్యాయి. రెండవ బ్యాచ్‌గా ఎంబీబీఎస్ మొదటి సంవత్సరానికి 150 సీట్లను మంజూరు చేశారు. దీంతో ఆలిండియా కోటా కింద 22 సీట్లు, రాష్ట్ర కోటా కింద 55 సీట్లు, ఎన్ఆర్ఐ కోటా కింద 14 సీట్లు, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద 36 సీట్లు, ఇతర కోటా కింద 23 సీట్లను కేటాయించారు. ఆలిండియా కోటా కింద మొదటి కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగిసింది. రాష్ట్ర కౌన్సెలింగ్ కూడా గురువారంతో ముగిసింది. ఇప్పటి వరకూ ఆలిండియా కోటా కింద 22 సీట్లకు 19 మంది చేరారు. రాష్ట్ర కోటా కింద 55 సీట్లు ఉండగా 53 మంది చేరారు. కన్వీనర్ కోటా కింద 23 సీట్లు ఉండగా చేరాల్సి ఉంది. ఎన్ఆర్ఐ కోటా కింద 14 మంది, సెల్ఫ్‌ఫైనాన్స్ కోటా కింద 36 మంది చేరారు. ఆలిండియా కోటా కింద సీటు పొందిన కేరళకు చెందిన విద్యార్థి హృదయ్ తన తల్లి దండ్రులతో వచ్చి ఏలూరు మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందారు.







పవిత్రాలు సమర్పిస్తున్న అర్చకులు పవిత్రాల అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఘనంగా పవిత్రోత్సవాలు

కాళ్ల, సెప్టెంబరు 27 : కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడవరోజైన శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ద్వార తోరణ పూజ, యాగశాల అర్చన, సుదర్శన నరసింహ హోమములు, సాయంత్రం స్వామి అమ్మవార్లకు పవిత్ర విసర్జన నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి సప్తనదుల జలాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.







ఆకివీడు సాలిపేటలో నిలిచిన వర్షపు నీరు.. ప్రత్తిపాడులో రోడ్డుపై పడిన చెట్టు కొమ్మ .. ఆచంటలో కురుస్తున్న వాన

వదలని వర్షం..మునిగిన పల్లపు ప్రాంతాలు

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్/ఆకివీడు/ఆచంట/పెంటపాడు, సెప్టెంబరు 27 : వారం రోజులుగా ప్రతీ రోజూ ఏదో సమయంలో వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయ మయ్యాయి. అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఏకధాటిగా గంటన్నరకు పైగా వర్షం కురిసింది. చిరువ్యాపారులు, వాహనాలపై ప్రయాణం చేసేవారు ఎక్కడికక్కడే తలదాచుకోవాలసిన పరిస్థితి నెలకొంది. 11 గంటల తర్వాత కొంత తెరిపి ఇవ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పాలకొల్లు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్ఆర్‌పేట, వెలమగూడెం, కొత్తపేట కొత్తకాలనీ, క్రిస్టియన్ పేట, రాజీవ్ నగర్ కాలనీ, చిత్రాయి చెరువు గట్టు, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైయినేజీలు పొంగి పొర్లాయి.పల్లపు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ప్రతిరోజూ ఏదో సమ యంలో వర్షం కురవడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఆకివీడులో భారీ వర్షం కురిసింది. రహదారులు కాలువలు, చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. ఆచంటలో ఉదయం సుమారు రెండు గంటలు పాటు జోరు వాన కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

పెంటపాడులో తెల్లవారు జాము నుంచి ప్రారంభ మైన వాన మధ్యాహ్నం వరకూ ఎడతెరపి లేకుండా కురుస్తూనే ఉంది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలోని చింతలంక ప్రాంతంలో భారీ చెట్టుకొమ్మ రోడ్డుపై పడింది. దీంతో స్థానికులు,వాహనదారులు ప్రయాణాలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో జనసేన నాయకుడు చెరుకూరి జగత్ సోమశేఖర్ ఆధ్వర్యంలో జన సైనికులు చెట్టుకొమ్మను తొలగించారు.

గురుకుల కళాశాల విద్యార్థినిపై వేధింపులు

గిరిజన సంక్షేమ శాఖ డీడీ విచారణ



బూసరాజుపల్లి గురుకులంలో విచారణ చేస్తున్న డీడీ నాయుడు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 27 : డ్రాయింగ్ టీచర్ విద్యార్థినిని వేధిస్తున్నాడన్న ఆరోపణలపై కెఆర్ పురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వీవీఎస్ నాయుడు శుక్రవారం బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో విచారణ చేశారు. జీలుగుమిల్లి మండలానికి చెందిన విద్యార్థిని బూసరాజుపల్లి గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతుంది. ఇదే కాలేజీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి జె.మురళికృష్ణ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురిచేయడంతో తీవ్ర మనస్థాపానికి గురైన విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. తల్లిదండ్రులు సర్దిచెప్పి కళాశాలకు పంపించారు. రెండు నెలలు క్రితం విద్యార్థిని తండ్రి చనిపోవడంతో దానిని అలుసుగా తీసుకున్న ఉద్యోగి మరింతగా వేధించడంతో కళాశాల నుంచి ఇంటికి వెళ్ళిపోయింది. ఆగ్రహించిన తల్లి, బంధువులు అసభ్య ప్రవర్తన, వేధింపులపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కళాశాలలో డీడీ ప్రాథమికంగా విచారణ చేశారు. విషయాన్ని ఐటీడీఏ పీవో, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారు. పూర్తి నివేదికను అధికారులకు పంపుతా మన్నారు. ఐటీడీఏ డీవైఈవో నీలయ్య, ఏటీడబ్ల్యువో శ్రీవిద్య, ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గామహేశ్వరావు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : బొరగం శ్రీనివాస్

విద్యార్థిని వేదించిన ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకుని ఆయన కళాశాలను సందర్శించి ఏటిడబ్ల్యువో శ్రీవిద్య, ప్రిన్సిపాల్ విజయలక్ష్మీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. విద్యార్థిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి : పీడీఎస్‌యూ

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు భూషణం,ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ డిమాండ్ చేశారు. బాలికల కళాశాలలో మహిళా ఉపాధ్యాయులను మాత్రమే నియమించాలన్నారు. జువైనల్ జస్టిస్ తీర్పును రద్దు చేయాలని కోరారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు.

ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపికలు ఇలా

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 27 : జిల్లా విద్యాశాఖ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 17 విభాగాల్లో బాలబాలికల సాఫ్ట్ టెన్నిస్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 28న గణపవరం జడ్పీ బాలుర హైస్కూలు, 30న హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఎంట్రీ ఫారంతో సహ ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని కోరారు.

గాంధీ స్మారక పురస్కారాలకు ఆరుగురు ఎంపిక

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 27 : మహాత్మాగాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆరుగురు గాంధేయ వాదులు, సేవాతత్పరులను 'గాంధీ స్మారక అవార్డు-2024' లకు ఎంపిక చేసినట్టు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. తుమ్మలపల్లి శివ (భీమవరం), కొండ్రెడ్డి సర్వేశ్వరరావు(ఉంగుటూరు), లకంసాని సత్యనారాయణ (మల్లవరం), పెన్మత్స రామమోహనవర్మ (చింతపర్రు), డాక్టర్ కేమిశెట్టి లలితాంబ (వల్లివేరు), రుద్రరాజు బంగార్రాజు (పత్తేపురం)లను అవార్డులకు ఎంపిక చేశామన్నారు. అక్టోబరు 2న పురస్కారాలు అందజేస్తామన్నారు.

జేఎన్వీ 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు తేదీ పొడిగింపు

పెదవేగి, సెప్టెంబరు 27 : జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించామని జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. గడువు తేదీ ముగిసిన సమయంలో విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని గడువు తేదీని వచ్చేనెల అక్టోబరు 7వ తేదీవరకు పొడిగించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. 8,9 తేదీల్లో దరఖాస్తులో తప్పొప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

11మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 27: పంగిడిగూడెంలో పేకాట స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,120 స్వాధీనం చేసుకున్నట్లు ద్వారకాతిరుమల ఎస్ఐ టి.సుదీర్ తెలిపారు.



ఎంపికైన పెంటపాడు పోస్టుబేసిక్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పెంటపాడు విద్యార్థులు

పెంటపాడు, సెప్టెంబరు 27 : జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎస్.రాజేష్‌కుమార్ తెలిపారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలలో అండర్14, అండర్-17 విభాగాలకు సంబంధించి వాలీబాల్ , కబడ్డీ క్రీడల్లో 10 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.దిలీప్, ఎం.పోసియ్యలతో పాటు ఎంపికైన విద్యార్థులకు హెచ్ఎం రాజేష్, విద్యా కమిటీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం

జిల్లాస్థాయి పోటీలకు పెదతాడేపల్లి విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 27: పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి క్రిడలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం షేక్ లాల్‌బీబీ మాట్లాడుతూ మండల స్థాయి అండర్ 17, 14 బాలుర, బాలికల విభాగాల్లో షాట్‌పుట్, డిస్క్‌త్రో, వాలీబాల్, కబడ్డి విభాగాల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా పెటీలకు ఎంపికైనట్టట వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీవైఈవో రవీంద్ర భారతి, సర్పంచ్ పోతుల అన్నవరం, ఎంఈవో వి హనుమ తదితరులు అభినందించారు.

క్రైమ్ కార్నర్

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి
చెరువులో మునిగి యువకుడి మృతి



దెందులూరు, సెప్టెంబరు 27 : దెందులూరు మండలం చల్లచింతల పూడిలో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గౌడపేటకు చెందిన సింహాద్రి అయ్యప్ప (28) వినాయక చవితి సందర్భంగా చల్లచింతలపూడి గ్రామంలోని పెద్ద ఊరుచెరువులో వినాయకుడిని నిమజ్జం చేస్తుండగా నీరు ఎక్కువగా ఉండటంతో గలంత య్యాడు. దీంతో గ్రామస్తులు చెరువులో వెలికి తీసి భీమడోలు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అయ్యప్ప మృతి చెందాడు. మృతునికి భార్య, పాప, బాబు ఉన్నారు.

దువ్వ కాలువలో గల్లంతైన బాలిక మృతి



తణుకు, సెప్టెంబరు 27 : దువ్వ మూలలంక వంతెన పైనుంచి వయ్యేరు కాలువలో దూకిన బాలిక మృతదేహం శనివారం లభ్యమైంది. శుక్రవారం ముద్దాపురం పాఠశాల్లో 9వ తరగతి చదువుతున్న బాలికను హెచ్ఎం మందలించడంతో బాలిక వయ్యేరు కాలువలో దూకి గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టి బాలిక మృతదేహం కనుగొన్నారు. బాలిక మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యనమదుర్రు కాలువలో మృతదేహం లభ్యం

భీమవరం క్రైం, సెప్టెంబరు 27 : యనమదుర్రు కాలువలో దూకిన వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు భీమవరం రెండో పట్టణ పోలీసులు తెలిపారు. భీమవరం పట్టణానికి చెందిన నాగరాజు (32) ఈనెల 25వ తేదీన యనమదుర్రు కాలువలోకి దూకగా అతని భార్య రాణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రెహమాన్ కేసు నమోదు చేశారు. నాగరాజు మృతదేహం లభించడంతో పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి పంపించి ఏఎస్ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

కాళ్ల, సెప్టెంబరు 27 : కాళ్ల మండలానికి చెందిన ఓ మైనర్ బాలికను వేధిస్తున్న యువకుడిపై కాళ్ల పోలీస్‌స్టేషన్లో పోక్సో కేసు నమోదైంది. మానసిక వికలాంగురాలైన బాలిక 5వ తరగతి చదువుకుంటున్నది. సీసలి గ్రామంలోని ఓ పాఠశాల ఉపాధ్యాయుడికి కారు డ్రైవర్‌గా పనిచేస్తు ఏలూరుకు చెందిన కృపానంద్ ఈనెల 19వ బాలికను కారులోకి తీసుకెళ్ళి వేధింపులకు గురి చేశాడు. జరిగిన సంఘటనను బాలిక బంధువులకు చెప్పింది. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా పోక్సో కేసు నమోదు చేసి యువకుడిని అరెస్టు చేశామని కాళ్ల ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు.

ఉద్యోగాల పేరిట మోసం..నకిలీ దంపతుల అరెస్టు

మధిరటౌన్, సెప్టెంబరు 27: ఉద్యోగాల ఇప్పిస్తామని తెలుగు రాష్ట్రాల్లోని పలువురి నుంచి డబ్బులు వసూలు చేసిన నకిలీ దంపతులను భీమడోలుకు చెందిన పోలీసులు మధిరలోని టీచర్స్ కాలనీలో అరెస్టు చేసి తీసుకువెళ్లారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలోని బంగారుపేటకు చెందిన అనిల్‌బాబు, కడప జిల్లా ఎర్రగుంట మండలం కలమల్లకు చెందిన శశాంక దంపతులమంటూ మధిరలోని న్యూటీచర్స్ కాలనీలోని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లోకి గత ఏప్రిల్‌లో అద్దెకు దిగారు. అనిల్‌బాబు తన తండ్రి ఇస్రోలో పని చేస్తున్నాడని ఉద్యోగాలు ఇపిస్తానని చెప్పి పలువురి నుంచిసొమ్ములు వసూలు చేశాడు. ఇతనిపై ఏపీలోని పలు స్టేషన్‌లలో కేసులు నమోదు కావడంతో భీమడోలు పోలీసులు సెల్ సిగ్నల్ ఆధారంగా బుధవారం రాత్రి మధిరలో అదుపులోకి తీసుకున్నారు. వీరు ఇరువురు నిజమైన దంపతులు కారని పలు చోట్ల దంపతులుగా నమ్మించి పలువురిని మోసం చేసినట్లు తెలుస్తుంది.వీరిపై తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెంతో పాటు ఏపీలోని పలుచోట్ల కేసులు నమోదైనట్లు తెలుస్తుంది. మధిరలో తాను అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని నుంచి కూడ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. పది లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తుంది.



రాష్ట్ర రైతు సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి, రైతు సంఘాల రాష్ట్ర కన్వీనర్ శోభనాద్రీశ్వరరావు

ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలు అవసరం

రాష్ట్ర రైతు సదస్సులో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 27: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలు అవసరమని వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వ విధానాలే కారణమని వ్యవసాయశాఖ మాజీ మంత్రి, ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ద్వారకాతిరుమల శ్రీకృష్ణయాదవ కల్యాణమండప ఆవరణలో శుక్రవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి రైతు సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షత వహించగా జిల్లా సీనియర్ నేత గుత్తికొండ కృష్ణారావు జెండా ఆవిష్కరించారు. వడ్డే మాట్లాడుతూ మద్దతు ధరల చట్టం తీసుకురావడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గడచిన ఐదేళ్లలో మోదీ ప్రభుత్వం 14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేసిందని రైతులకు మాత్రం మాఫీ చేయలేదని చెప్పారు. రైతులకు రుణమాఫీ అమలయ్యేలా కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తేవాలని సూచించారు. ఏపీ రైతు సంఘరాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు కృష్ణయ్య, కేశవరావులు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై దేశవ్యాప్త రైతు ఉద్యమాన్ని త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. ఢిల్లీలో నవంబరు 26న జరుగనున్న కార్యక్రమంలో రైతు సంఘాలతో పాటు కార్మిక సంఘాలు పాల్గొంటాయన్నారు. రైతుల బోర్లకు విద్యుత్ మీటర్లు పెట్టే జీవో 22ను రద్దు చేయాలని కోరారు. పండిన పంటకు 50 శాతం అదనపు రేటు చెల్లించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. టీడీపీ నాయకుడు మొగతడకల శ్రీనివాసరావు, రాష్ట్ర స్థాయి రైతు సంఘనేతలు శ్రీనివాసరావు, జొన్నా శివ శంకర్రావు, ఆంజనేయులు, కె.మోహనరావు,కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్, పాల్గొన్నారు.



ఆక్వా ఎక్స్‌పో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ఆక్వాలో నాణ్యమైన ఉత్పత్తులను సాధించాలి

ఎన్ఆర్‌పీ అగ్రహారంలో ఆక్వా ఎక్స్‌పో ప్రారంభం


ఉండి సెప్టెంబరు 27: సాగులో మెళకువలతో నాణ్యత గల ఉత్పత్తులను సాధించాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ఆక్వా రైతులకు సూచించారు. శుక్రవారం ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారంలోని కోట్ల ఫంక్షన్ హాలులో ఆక్వా ఎక్స్‌పో చీఫ్ ఎగ్జిక్యూటివ్ నజీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆక్వా ఎక్స్‌పో 2024 కార్యక్రమం ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు ప్రారంభించారు.కలెక్టరు మాట్లాడుతూ రొయ్యలు, చేపలు, పీతలు పెంపకంలో సాంకేతికత, ఆక్వా కల్చర్‌లో మెరుగైన దిగుబడి సాధించేందుకు అవగాహన కల్పించేలా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఆక్వాకల్చర్‌పై పరిశోధన సంస్థలు కూడా ఇందులో పాల్గొనడంతో ప్రయోజనకరంగా వుంటుందన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఆక్వాసాగు చైనాలో ఎక్కువగా సాగవుతోంది తరువాత స్థానంలో ఇండియా వుందన్నారు. ప్రస్తుతం ఆక్వాసాగులో ఎన్నో ఒడుదుడుకులు ఏర్పడుతున్నాయన్నారు. వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి రైతులకు అండగా నిలవాలన్నారు. కేంద్రవాణిజ్యం, పరిశ్రమలు మంత్రిత్వశాఖ ఎంపెడీ డిప్యూటీ డైరక్టరు మనోజ్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాదు, ఆంధ్రప్రదేశ్ ఆక్వా డీలర్సు అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణంరాజు, ఆంధ్ర ప్రదేశ్ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నంబూరి వెంకట్రామరాజు, శ్రీనివాసరావు, సూర్యమిత్ర మేనేజింగ్ డైరక్టరు యిర్రింకి సూర్యారావు, వివిధ ఉత్పత్తుదారులు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోటి రూపాయల విరాళం చెక్కు అందిస్తున్న సాగర్ గ్రంధి ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ తరపున గ్రంధి బాలాజీ, గ్రంధి చల్లారావులు

సీఎం సహాయ నిధికి సాగర్ గ్రంధి ఎక్స్‌పోర్ట్స్ రూ.కోటి విరాళం

భీమవరం టౌన్, సెప్టెంబరు 27 : ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల నేపథ్యంలో సీఎం సహాయనిధికి సాగర్ గ్రంధి ఆక్వా ఎక్స్ పోర్ట్స్ కంపెనీ తరుపున గ్రంధి బాలాజీ, గ్రంధి చల్లారావులు కోటి రూపాయల విరాళాన్ని శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందించారు. బాధితులను ఆదుకోవడానికి ముందుకు రావడం అభినందనీయమని సీఎం అన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశెం సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, పారిశ్రామిక వేత్తలు

ఉంగుటూరు నియోజకవర్గం నుంచి 84.83 లక్షలు

ఉంగుటూరు, సెప్టెంబరు 27: ఎమ్మెల్యే ధర్మరాజు 'నా పిలుపు మేరకు' నినాదంతో ఉంగుటూరు నియోజకవర్గ ప్రజలు స్పందించి అందజేసిన 84 లక్షల 83 వేల 293 రూపాయల మొత్తాన్ని చెక్కు రూపంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి చంద్రబాబునాయుడికి అందించారు. ఎమ్మెల్యేతో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, పొత్తూరి కృష్ణంరాజు, పారిశ్రామికవేత్త మనోజ్ , వంగా రఘు, చింతలపాటి భాస్కర రాజు తదితరులు పాల్గొన్నారు.

తాళం చెవులు మింగేసిన యువకుడు

చికిత్స చేసి బయటకు తీసిన ఏలూరు ఆయుష్ వైద్యులు



ఎక్స్‌రేలో కనిపిస్తున్న తాళం చెవులు..



ఏలూరు అర్బన్, సెప్టెంబరు 27 : బీరువా తాళం చెవులను మింగేసిన 20 ఏళ్ళ వ్యక్తి పొట్ట నుంచి ఏలూరు ఆయుష్ ఆస్పత్రి వైద్య నిపుణులు బయటకు తీసినట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం అర్ధరాత్రి తర్వాత ఆస్పత్రికి వచ్చిన వ్యక్తికి ఎక్స్‌రే తీసి పొట్టలో తాళం చెవులున్నట్టు నిర్ధారించుకుని ఎండోస్కోపీ ద్వారా పొట్ట నుంచి బయటకు తీసినట్టు వివరించారు. తాళం చెవులు ఒకొక్కటి ఆరున్నర సెంటీమీటర్ల పొడవు ఉన్నాయని తెలిపారు. కొందరికి నోట్లో వస్తువులను పెట్టుకునే అలవాటు ఉంటుందని ఇది ఆ విధంగా జరిగి ఉంటుందని వివరించారు.గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ వెంకట జయదీప్, మత్తు వైద్యుడు డాక్టర్ శ్రీరామ్ శస్త్ర చికిత్స సేవలందించారు.

రైతుల సేవలో వేల్పూరు సొసైటీ ప్రథమం : ఆరిమిల్లి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, సెప్టెంబరు 27: రైతుల సేవలో వేల్పూరు ప్రాథమిక సహకార పరపతి సంఘం ముందుంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం సొసైటీ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు అభివృద్ధిని విస్మరించి సొసైటీని భ్రష్టు పట్టించారన్నారు. కేవలం రాజకీయాల కోసం, అభివృద్ధి లేకుండా కారుమూరి పాలన సాగించారని చెప్పారు. రానున్న రోజుల్లో సొసైటీ అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తానని తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కళింగగూడెం వాసికి సీఎం నిధి చెక్ అందజేత


రూ.2.73 లక్షల చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామ

ఆకివీడు రూరల్ సెప్టెంబరు 27 : కళింగగూడెం గ్రామానికి చెందిన తాండ్ర మీనాకు హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో గుండె శస్త్రచికిత్స చేయించుకున్నందుకు రూ.2.73,700 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అందించారు. దుంపల జనార్దన, పూజారి వరప్రసాద్ తదితరులున్నారు.

పబ్లిక్ కుళాయికి బిరడా ఏర్పాటు



ఆకివీడు, సెప్టెంబరు 27 : నగర పంచాయతీ పరిధిలో పబ్లిక్ కుళాయికి బిరడా లేక తాగునీరు వృథా అవుతుందని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక మదనగోపాలస్వామి దేవస్థానం వీధిలో పబ్లిక్ కుళాయికి బిరడా వేశారు. పట్టణ పరిధిలోని వార్డుల్లో కూడా పబ్లిక్ కుళాయిలు పరిశీలించి బిరడాలు లేకపోతే వాటికి కూడా ఏర్పాటు చేస్తామని నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు.

ఎమ్మెల్యే బొలిశెట్టిని కలిసిన మున్సిపల్ కమిషనర్


ఎమ్మెల్యేని కలిసిన కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 27 :తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ గా ఎం.ఏసుబాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జనసేన పార్టీ కార్యాలయంలో కలసి సత్కరించగా పట్టణాభివృద్ధి కోసం కృషి చేయాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన మురళీకృష్ణను ఎమ్మెల్యే సత్కరించారు.

మంచి అలవాట్లతో గుండె పదిలం

తణుకు, సెప్టెంబరు 27: మంచి ఆహారపుటలవాట్లతో గుండె పదిలమని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ యు. వెంకటేష్ అన్నారు. రోటరీ క్లబ్‌లో గుండె వ్యాధుల నివారణ- జాగ్రత్తలు అంశంపై ఆయన మాట్లాడుతూ మంచి నిద్ర, వ్యాయామం, న్యూట్రీషన్లు, కూరగాయలు ఆహారంలో ఉండాలన్నారు. అనంతరం ఆయనను రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థ, రొటేరియన్లు సుధాకర్, సుబ్రహ్మణ్యం, గమిని రాంబాబు తదితరులు సన్మానించారు.

ఉద్యమనేత సన్యాసిరావు మృతి


సన్యాసిరావు (ఫైల్)

ఉండి, సెప్టెంబరు 27: ఆంధ్రప్రదేశ్ హైవేస్ ఆర్ అండ్‌బీ వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, ఉద్యమనేత ఎస్‌హెచ్ సన్యాసిరావు (90) మృతి చెందారు. శుక్రవారం ఉదయం స్వగ్రామం యండగండిలో వృద్ధాప్యం కారణంగా అస్వస్థతకు గురై కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆయన మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు

గణపవరం, సెప్టెంబరు 27: గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. భీమవరం విష్ణు డెంటల్ కళాశాల వైద్యులు కేఎస్.చైతన్యరాయ్ ఆధ్వర్యంలో 15 మంది దంతవైద్య బృందం 220 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన చికిత్సలు నిర్వహించారు. శిబిరాన్ని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి ప్రారంభించారు. స్థానిక టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు అభివృద్ధి కమిటీ సభ్యుడు చింతలపాటి సత్యనారాయణ రాజు, నడింపల్లి శ్రీరామ్, వైస్‌ప్రిన్సిపాల్ మధురాజు, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జీ.వెంకటరమణ పాల్గొన్నారు.

30న భీమవరంలో జాబ్ మేళా

భీమవరం అర్బన్, సెప్టెంబరు 27: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కేరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో భీమవరంలోని ఆర్ఆర్‌డీఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధికారి సీహెచ్ మధుభూషణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, బజాజ్ క్యాపిటల్, ఆషేక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి కంపెనీలో కస్టమర్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, లోన్ ఆఫీసర్, జూనియర్ ఫార్మసీ అసిస్టెంట్ మొదలైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 27 :** స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొంత కాలంగా పనిచేసి పలు ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న ఉద్యోగులను స్థానిక దస్తావేజు లేకర్ల సంఘం తరపున శుక్రవారం ఘనంగా సత్కరించారు.
- **పాలకొల్లు రూరల్ :** వెలివెల జడ్పీ హైస్కూల్లో శుక్రవారం సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమం హెచ్‌ఎం బళ్ళ శ్రీరామమూర్తి నిర్వహించారు.
- **భీమవరం అర్బన్ :** భీమవరంలో కలెక్టరేట్ వద్ద ఈనెల 30వ తేదీన పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదలు వాటికి ప్రభుత్వం వైపు నుంచి, యాజమాన్యం నుంచి ఎటువంటి నివారణ చర్యలు తీసుకోకపోవడంపై ధర్నా నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ పేర్కొన్నారు.
- **భీమవరంటౌన్ :** తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడాలని, హిందూ దేవాలయాలను ప్రభుత్వంనుంచి విముక్తి చేయాలని కోరుతూ ఈనెల 30న విశ్వహిందూ పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని ఆర్ఎస్ఎస్ నాయకులు తెలిపారు.
- **భీమవరం క్రైం :** కొద్ది రోజుల క్రితం ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అనుచితంగా ప్రవర్తించి అంబేడ్కర్‌ను అవమానపరిచేలా ప్రవర్తించడంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని యునైటెడ్ అడ్వకేట్‌లు శుక్రవారం డిమాండ్ చేశారు.
- **పెనుగొండ :** విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు వారికి ప్రాక్టికల్‌గా చేసి చూపించింది జీవితంలో మరిచిపోరని శుక్రవారం పెనుగొండలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు రైస్ మిల్లుల ఆవశ్యకత, రైస్ మిల్లుల పనితీరును ఒకేషనల్ ట్రైనర్ డి. వందన వివరించారు.



ఎమ్మెల్యే అంజిబాబుకు రూ.లక్ష విరాళం అందించిన ఫోర్ సీజన్స్ యజమాని రామరాజు.. రూ.3 లక్షల విరాళాన్ని అందించిన అనాకోడేరు గ్రామస్థులు

కష్ట సమయాల్లో ఆదుకునేందుకు..

- విజయవాడ వరద బాధితులకు దాతల సాయం

భీమవరంటౌన్, సెప్టెంబరు 27 : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని, తోటి వారికి సాయం చేయడం భగవత్ సేవతో సమానమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు దాతలు విరాళాలను అందించారు. పట్టణానికి చెందిన భూపతిరాజు వెంకట రామరాజు (ఫోర్ సీజన్స్ రామరాజు) రూ.లక్ష విరాళం అందించారు. భీమవరం క్యాన్సర్వింగ్ అసోసియేషన్ రూ.58 వేలు, భీమవరం మండలం అనాకోడేరు గ్రామస్థులు రూ.3లక్షల 5వేలు, పెదగరువు గ్రామస్థులు రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వర రావు, నల్లం చిట్టిబాబు, చిక్కాల వెంకటేశ్వరరావు, గురుప్రసాద్, బదరాల పుల్లేశ్వరావు పాల్గొన్నారు. వీరవాసరం మండలం రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూలులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీబోను దుర్గాప్ర సాద్ రూ.10 వేలను ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. బోను దుర్గాప్రసాద్ తన ఒకరోజు జీతంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అందించిన వాటితో పాటు రూ.2,222లను సీఎం నిధికి అందించారని హైస్కూలు హెచ్‌ఎం కానుకొలను శ్రీనివాసరావు తెలిపారు. వీరవాసరం మాజీ ఎంపీపీ వీరవల్లి చంద్రశేఖర్, రాయపల్లి వెంకట్ పాల్గొన్నారు

అధికారుల బాధ్యతల స్వీకరణ


ద్వామా సంచాలకులుగా అప్పారావు బాధ్యతల స్వీకరణ


వర ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిపో మేనేజర్లు, అధికారులు

భీమవరంటౌన్, సెప్టెంబరు 27 : జిల్లా గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులుగా డాక్టర్ కె.సీహెచ్ అప్పారావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డ్వామా పీడీగా పనిచేసిన ఎం.ప్రభాకర్‌రావు తాడేపల్లిగూడెం డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. డాక్టర్ కెసీహెచ్ అప్పారావు ఇప్పటివరకు నరసాపురం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా గ్రామవార్డు సచివాలయం అధికారిగా పనిచేస్తూ బదిలీపై జిల్లా పథక సంచాలకులుగా కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందరభంగా సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అభినందనలు తెలిపారు.

జిల్లా ప్రజా రవాణా అధికారిగా వరప్రసాద్.

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎస్.వి.ఆర్. వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు, ఇప్పటి వరకు ఏలూరు జిల్లాప్రజారవాణాధికారి పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయనను పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులను నడుపుతూ ప్రజలకు ఆర్టీసీ సేవలను మరింత చేరువ చేయడానికి కృషి చేస్తానన్నారు. పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి, తణుకు డిపో మేనేజర్ ఎస్.గిరిధర్‌కుమార్, తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వైసత్యనారాయణమూర్తి, భీమవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, జిల్లా ఎకౌంట్స్ ఆఫీసర్ ఎస్వీ రావు, జిల్లా షెడ్యూల్ సెల్ ఇన్‌చార్జి ఆర్. బాలసుబ్రహ్మణ్యం, పీఆర్‌ఓ. రావి రావికుమార్ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటేశ్వరరావు

భీమవరం మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా చోడగం వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిగూడెం మునిసిపాల్టీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన అనంతరం మర్యాదపూర్వకంగా కమిషనర్ రామచంద్రారెడ్డిని కలిశారు.

- మొగల్తూరు : మొగల్తూరు గ్రూప్ దేవాలయ కార్యనిర్వహణాధికారిగా బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి, కేపీపాలెం, పేరుపాలెం, మొగల్తూరు గ్రామాలకు చెందిన ఎనిమిది దేవాలయాలకు ఈవోగా వ్యవహరిస్తారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన చాగంటి సురేష్‌నాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు.
- పెనుమంత్ర : పెనుమంత్ర ఏఎస్ఐగా మొనవర్తి సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెనుమంత్ర పోలీస్ స్టేషన్‌లో కొంత కాలం నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. సిబ్బంది ఆయనను అభినందించారు.
- ఆచంట : పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ అమ్మవార్ల దేవస్థానం ఈవోగా ఆదిమూలం వెంకట సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాలకొల్లు క్షీరపురి అన్నదాన సత్రం ఈవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. మాచేనమ్మ దేవస్థానంతో పాటు ఆచంట రామేశ్వరస్వామి, మదన గోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఈవో రాము బదిలీపై నరసాపురం వెళ్లారు.
- పాలకొల్లు రూరల్ : పాలకొల్లు రూరల్ ఎస్ఐగా బి.సురేంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాలకొల్లు రూరల్ సర్కిల్ పరిధిలోని యలమంచిలి, పోడూరు పోలీస్‌స్టేషన్లలో సురేంద్ర పనిచేశారు. ఎస్ఐ సురేంద్రను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రైటర్ మూర్తి, సిబ్బంది అభినందించారు.

'విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 27 : విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టర్ల నుంచి కాకుండా సంస్థ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని విద్యుత్‌మీటర్ల రీడర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రాడీపేట తూర్పు కాపు కల్యాణ మడపంలో పాలకొల్లు, నరసాపురం, భీమవరం ఏరియాల్లోని రీడర్ల సంఘం సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన శివారెడ్డి మాట్లాడుతూ తగ 15, 20 ఏళ్ళుగా విద్యుత్ సంస్థను నమ్ముకుని పనిచేస్తున్నామని, ప్రీపెయిడ్ మీటర్ల రూపంలో మా ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని, అందువల్ల తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఒ.శ్రీనివాసరావు మాట్లాడుతూ మీటరు రీడర్లకు సీఎండీ ఆదేశాల మేరకు సర్వీసుకు రూ.3.46 పైసలు, రూరల్ ప్రాంతాల్లో 3.89 పైసలు చెల్లించాల్సి ఉండగా కాంట్రాక్టర్లు మాత్రం రూ.0.25 పైసల నుంచి రూ.0.50 పైసలు తగ్గించి ఇస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. జిల్లా కోశాధికారి మల్లేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి. జాకబ్, శ్రీనివాసరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జీఆర్ రెడ్డి రచించిన గ్రంథం ఆవిష్కరణ


గ్రంథం ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ కిరణ్‌బేడి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 27: తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జీఆర్ రెడ్డి రచించిన 'ఇంటర్‌పిటీషన్ ఆఫ్ ఫీల్డ్స్ ఇన్ ఆప్టికల్ కోహ్రినెన్స్ ట్రోమోగ్రఫీ' అనే గ్రంథాన్ని పాండి చ్చేరి మాజీ గవర్నర్ కిరణ్ బేడి ఆవిష్కరించారు. పాండి చ్చేరిలో గ్లకోమా సొసైటీ ఆఫ్ ఇండియా అఖిల భారత అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ కుమార్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన 33వ మహాసభల్లో ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆధునిక ప్రక్రియలకు అనుగుణంగా డయాగ్నైస్ చేసి సకాలంలో గ్లకోమాను గుర్తించడంపై సవివరంగా తెలియచేశారని వక్తలు ప్రశంసించారు. మాజీ గవర్నర్ కిరణ్‌బేడి డాక్టర్ జీఆర్ రెడ్డిని సత్కరించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం టౌన్, సెప్టెంబరు 27: పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

ముగిసిన పారిశ్రామిక వేత్తల శిక్షణ తరగతులు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 27 : స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐదు రోజులుగా జరుగుతున్న ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి అధ్యక్షత వహించారు. శిక్షణ అందించిన లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ద్వారా ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రధాన శిక్షణ ఇచ్చిన పుల్లూరి హేమాద్రి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తగా ఎదగడానికి మెలకువలు, వ్యాపార నిర్వహణ, ప్రభుత్వ అనుమతులు వంటి అంశాలను వివరించారు. ఐఎల్‌వో ట్రయినర్ రాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవిశంకర్, అధ్యాపకులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ కన్వీనర్ మనోజ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎక్సిషారెడ్డి, సిబ్బంది, 30 మంది మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత పాటించాలి

తణుకు, సెప్టెంబరు 27: పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తున్నపుడు స్వచ్ఛత పాటించాలని ఏలూరు పర్యాటక శాఖ మేనేజర్ కె.యస్. ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవం -స్వచ్ఛతపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. టూరిజం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన, క్విజ్, పోస్టర్ పెయింటింగ్, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్, టూరిజం మేనేజర్ పట్టాభిరామ్, సూపరింటెండెంట్ జాన్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మావుళ్ళమ్మ సన్నిధిలో.. మూడు నుంచి దసరా ఉత్సవాలు

భీమవరంటౌన్, సెప్టెంబరు 27 : భీమవరం ఇలవేల్పు మావుళ్ళమ్మ దసరా మహోత్సవాలు వచ్చేనెల మూడు నుంచి పన్నెండో తేదీ వరకు జరుగుతాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవ బ్రోచర్, పుస్తకాలను శుక్రవారంరాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్‌మహేష్ మాట్లాడుతూ అమ్మవారికి వచ్చేనెల 3న శ్రీసువర్ణ రజిత కవచాలంకరణ, 4వ బాల త్రిపుర సుందరీదేవి, 5న గాయత్రి దేవి, 6న అన్నపూర్ణ దేవి, 7న మహాలక్ష్మి దేవి, 8న లలితా త్రిపుర సుందరీ దేవి, 9న సరస్వతి దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్ధినిదేవి, 12 రాజరాజేశ్వరిదేవి అలంకరణ చేస్తామని, 12వ తేదీన గ్రామోత్సవం నిర్వహిస్తామని 14న అన్న సమారాధనను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభిస్తారని తెలిపారు. ప్రధాన ర్చకు లు మద్దిరాలమలికార్జున శర్మ, ఆలయ మాజీ చైర్మన్ కారుమూరి సత్యనా రాయణమూర్తి, పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, భీమాల శ్రీరామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

- భీమవరం పట్టణంలోని మెంటేవారితోటలో వున్న విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి దేవి దేవస్థానంలో వచ్చేనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవ బ్రోచర్, పుస్తకాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆవిష్కరించారు. 14న గ్రామోత్సవం, 17న అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు. మద్దాల సత్యనారాయణ, నైనాలశెట్టి లీల, సమతం తాతాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : స్థానిక యడ్ల బజారులోని కనక దుర్గమ్మవారికి శుక్రవారం సందర్భంగా వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల ఆర్థిక సాయంతో 500 మందికి అన్నసమారాధన నిర్వహించారు.
- పాలకొల్లు టౌన్ : వినాయక చవితి సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో స్నేహ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రులు ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ నిమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులను మంత్రి నిమ్మల అభినందించారు.

దసరా ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ..

- తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని 13 వార్డులో ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తన కుమారుడు రాజేష్‌తో కలసి శుక్రవారం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు మంత్రి నిమ్మలకు ఆహ్వానం


మంత్రి నిమ్మలను ఆహ్వానిస్తున్న క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది

పాలకొల్లు అర్బన్ : క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించే శ్రీదేవి నవరాత్రుల ప్రారంభోత్సవానికి విచ్చేయాలని కోరుతూ మంత్రి నిమ్మల రామానాయుడును శుక్రవారం ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, అర్చకులు సిబ్బంది ఆహ్వాన పత్రికను అందజేశారు. పట్టణ సీఐ కె రజనీకుమార్ తదితరులు ఉన్నారు. శుక్రవారం ఆలయంలోని మండపాలను శుభ్రం చేశారు.

- మొగల్తూరు, : దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వచ్చేనెల 3 నుంచి ప్రారంభిస్తున్న దృష్ట్యా మొగల్తూరు కూరగాయల వర్తకుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభించారు. పందిర్ల ఏర్పాటు చేసేందుకు అర్చకులు కొత్తలంక ప్రసాద్ శుక్రవారం పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గునిశెట్టి నర్సింహమూర్తి వరలక్ష్మీ దంపతులు పందిర రాటకు ప్రత్యేక పూజలు జరిపి పనులు ప్రారంభించారు. కూరగాయల వర్తకులు ముక్కు. ఓం, పుల్లయ్య నాయుడు, కడలి శ్రీను, గుత్తుల బాబి, ముక్కు జ్ఞాని, పినిశెట్టి సాయి, వీరభద్రం, సంకా సోంపండు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ తరలింపు వాస్తవం కాదు

- తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు : డీఆర్వో

భీమవరంటౌన్, సెప్టెంబరు 27 : భీమవరం మార్కెట్ యార్డ్‌లో నిర్మాణంలో ఉన్న భవనం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకని, త్వరలో కలెక్టర్ కార్యాలయం ఆ భవనంలోకి తరలిస్తారనే ప్రచారంలో వాస్తవం లేదని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు తెలిపారు. ఇటువంటి ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణం ఎక్కడ నిర్మించేది ఇంకా నిర్ధారణ కాలేదని, కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేస్తే ముందే తెలుపుతామని స్పష్టం చేశారు. ఇటువంటి ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని డీఆర్వో హెచ్చరించారు


సనాతన ధర్మరక్ష దీక్షకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

సనాతన ధర్మ దీక్షకు 'ఆరిమిల్లి' సంఘీభావం

ఇరగవరం/నరసాపురం రూరల్, సెప్టెంబరు 27 : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపుతో ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామంలో కూటమి నాయకులు శుక్రవారం ఏర్పాటు చేసిన సనాతన ధర్మ దీక్షకు ఎమ్మె ల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సంఘీభావం తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తిరుపతి ప్రతిష్ఠను మంటగలిపారని విమర్శించారు. దీక్షలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- డిప్యూటీ సీఎం పవనకల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు నరసాపురంలో జనసేన రాష్ట్ర నాయకులు కలవకొలను తులసీ మద్దతు ప్రకటించారు. లడ్డూ కల్తీ చేసిన దోషుల్ని కఠినంగా శిక్షించాలన్నారు. పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలియజేయడం హర్షనీయమన్నారు.

చదువుతోపాటు సమాజంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 27: చదువుతో పాటు విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ ఈ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ భవనంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ స్టూడెంట్ ఫస్ట్ 2కె24 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. విద్యార్థులు సమాజంలో జరుగుతున్న మార్పుల్ని గమనించాలన్నారు. డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ.. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఖోఖో, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రామ్, వాసు, ఎం.డి.జాన్, అనిల్‌బాబు, చందు, ధరణ్, సన, సిరి, నవీన్, పవిత్ర, చిరంజీవి పాల్గొన్నారు.

'ప్రణాళికతో ఉండి సహకార బ్యాంక్ అభివృద్ధి'

ఉండి, సెప్టెంబరు 27 : ఉండి సహకార రూరల్ బ్యాంక్ అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని బ్యాంక్ కార్యదర్శి భగత్ శ్రీనివాసరావు, బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి పి.ఆనందరాజులు అన్నారు. శుక్రవారం ఉండి సహకార రూరల్ బ్యాంక్ మహాజన సభ జరిగింది. జనసేన సీనియర్ నాయకుడు వేగేశ్న కనకరాజు సూరి మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. బ్యాంక్‌ను అంతా ప్రక్షాళనం చేస్తున్నామని, చిన్నపాటి సమస్యలను పరిష్కరించామన్నారు. బ్యాంక్ కార్యదర్శి భగత్ శ్రీనివాస్, ప్రత్యేక అధికారి ఆనందరాజులు మాట్లాడుతూ బ్యాంక్‌లో డిపాజిట్లు రూ.17 కోట్లు వున్నాయన్నారు. డీసీసీబీ నుంచి తీసుకుని వచ్చినవి రూ.10కోట్లు, తమ బ్యాంక్ నుంచి రైతులకు ఇచ్చిన ప్రత్యేక రుణాలు రూ.30కోట్లు, బ్యాంక్ పరిధిలో డీసీసీబీకి ఇన్‌వెస్ట్‌మెంట్స్ రూ.4 కోట్లు వున్నట్లు అధికారులు వెల్లడించారు. మాజీ బ్యాంక్ చైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై గ్రామస్థుల గళం


సమస్యలపై నిలదీస్తున్న సతీష్

నరసాపురం రూరల్, సెప్టెంబరు 27: గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై శుక్రవారం జరిగిన గ్రామ సభలో గ్రామస్థులు గళం విప్పారు. సీతారాంపురం సౌత్ గ్రామంలో సర్పంచ్ వెంకట్ అధ్యక్షతన స్వచ్ఛతా హీ సేవా సభ నిర్వహిం చారు. గ్రామంలో శానిటేష న్, తాగునీటి నిర్వహణ సక్రమంగా లేదని, ఈ కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేడిది సతీష్ మండిపడ్డారు. పేరుకు నలుగురు శానిటరీ సిబ్బంది ఉన్నా.. ఎవరూ చెత్త సేకరణలో పని చేయడం లేదన్నారు. అనధికార లేఅవుట్‌లో కొంతమందికి కరెంట్ కనెక్షన్ ఇచ్చి, మరికొంత మంది అర్జీలు పెట్టుకుంటే వాళ్ళకు మాత్రం కార్యదర్శి ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రతి సమస్యను రికార్డుల్లో ఎక్కించి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రావి వీరాస్వామి, కె.త్రినాథ్, రాము, మండవల్లి నాగలక్ష్మణరావు, శంకరరావు, కార్యదర్శి శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

'ఎక్సప్లోరింగ్ పర్సనాలిటీ'పై సదస్సు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 :విద్యార్థులను ఉద్దేశించి నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని, విద్యార్థులు కుటుంబ విలువలు తెలుసుకుని మెలగాలని స్వామి చిద్రూపానందాజీ విద్యార్థులకు సూచించారు. శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం నోయిడాలోని చిన్నమయ మిషన్‌కు చెందిన స్వామి చిద్రూపానందాజీ ఆధ్వర్యంలో 'ఎక్సప్లోరింగ్ పర్సనాలిటీ అండ్ హ్యూమన్ వాల్యూస్'పై సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మం, కళాశాల ఏవో సురేష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'మహనీయులు ఆర్ఎస్, శ్రీరామ్మూర్తి'

నరసాపురం టౌన్, సెప్టెంబరు 27: ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన మహనీయులు మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్, వలవల శ్రీరామ్మూర్తి అని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. శుక్రవారం మీరా గ్రంథాలయంలో జరిగిన సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు భావజాలంతో అనేక ఉద్యమాలు చేశారన్నారు. వారి పోరాటాలు, ఉద్యమాలు నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నెక్కంటి క్రాంతికుమార్, కవురు పెద్దిరాజు, ఆరేటి మృత్యుంజయ, అడ్డాల శ్రీనివాస్, పి.పూర్ణ, ఎం. త్రిమూర్తులు, రామ్మోహన్‌రావు, టి.సత్యనారాయణ, నారాయణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు సహకరించాలి

మొగల్తూరు/పెనుగొండ, సెప్టెంబరు27: ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు గ్రామస్థులంతా సహకరించాలని మొగల్తూరు గ్రామ సర్పంచ్ పడవల మేరీ కోరారు. శుక్రవారం మొగల్తూరులో గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశంలో స్వాతంత్ర్యం సాధించి 2047కి వందేళ్లు పూర్తవుతుందని అప్పటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాల్లో గ్రామస్థులంతా భాగస్వాములు కావాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, ఉప సర్పంచ్ బోణం నర్సింహారావు, పడవల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గంగన్న, సచివాలయ కార్యదర్శులు గంటా సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పెనుగొండ మండలం పెనుగొండలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం స్వర్ణాంధ్ర పోస్టర్‌లను ఆవిష్కరించారు. వడలి గ్రామంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మి అధ్యక్షతన స్వచ్ఛతా హీ సేవా ప్రత్యేక గ్రామ సభ నిర్వహించి కార్యక్రమాలపై చర్చించారు. ఉపసర్పంచ్ వలవన నరేష్, కార్యవర్గ సభ్యులు మేకా శివయ్య, ఉప్పలపాటి చంటి, బొర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.